క్లుప్తంగా

పోలీస్ కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే తాతయ్య



జగ్గయ్యపేట అర్బన్: విజయవాడ పోలీసు కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎస్వీ రాజశేఖరబాబును జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) సోమవారం కలిశారు.

విజయవాడలోని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేసినట్లు ఎమ్మెల్యే తాతయ్య తెలిపారు.

కబేళాకు తరలిస్తున్న 30గోవులు స్వాధీనం



కంచికచర్ల: అక్రమంగా గోవులను కబేళాకు తరలిస్తున్న రెండు డీసీఎం వ్యాన్‌లను జాతీయ రహదారిపై అంబారుపేట వై.జంక్షన్‌వద్ద నందిగామ పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. నందిగామ పోలీసు ఇన్‌స్పెక్టర్ హనీష్ కథనం మేరకు ఆదివారం అర్ధరాత్రి విజయవాడ సమీపంలోని ఆగిరిపల్లి నుంచి హైదరాబాద్‌లోని కబేళాకు రెండు డీసీఎం వ్యానులలో 30గోవులను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అనంతరం గోవులను నందిగామ పల్లగిరి గోసంరక్షణ కేంద్రానికి తరలించారు. గోవులను తరలిస్తున్న డీసీఎం వ్యాన్‌ల డ్రైవర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆదమరిస్తే ప్రమాదమే



పెనుగంచిప్రోలు: మండల కేంద్రం పెనుగంచిప్రోలు నుంచి ముండ్లపాడు వెళ్లే రహదారి మధ్యలో పెద్ద గుంత పడింది. వాహనదారులు ఏమాత్రం ఆదమరచినా ప్రమాదం తప్పదు. దీంతో స్థానిక ప్రజలు గుంతలో రాళ్లు పెట్టి ప్రమాద సూచికగా ఓ కర్రను నిలుచోపెట్టారు. తక్షణం ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ

జయంతి(వీరులపాడు): ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యేలా సులభరీతిలో విద్యాబోధన చేయాలని ఎంఈవో పాల్ కెనడీ సూచించారు. జయంతి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలన్నారు. ముఖ్యంగా ఉపాధ్యాయులు సమయపాలన పాటించటంతోపాటు చదువులో వెనుకబడిన వారిని గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అంతేకాకుండా మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు అందించే భోజనాన్ని పర్యవేక్షించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



భీమవరం(వత్సవాయి): గేదెల దాడి ఘటనలో గాయపడిన షేక్ ఇబ్రహీంకు మాజీఎమ్మెల్యే సామినేని ఉదయభాను సోమవారం రూ.10వేలను ఆర్థికసాయం అందజేశారు. గేదెల దాడిలో తీవ్ర గాయాలపాలైన ఇబ్రహీం విజయవాడలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్సపొందుతుండగా, విషయం తెలుసుకున్న ఉదయభాను గ్రామపార్టీ నాయకుడు గుండం రంగారెడ్డి ద్వారా రూ.10వేలను ఇబ్రహీం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆర్థికసాయం అందించిన ఉదయభానుకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ మాజీ సభ్యులు షేక్ హుస్సేన్, మాజీ ఎంపీటీసీ నాగుల్ తదితరులు ఉన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థి వితరణ

రోలుపడి(తిరువూరురూరల్): మండలంలోని రోలుపడి ఎంపీయూపీ స్కూల్‌కు పూర్వ విద్యార్థి ల్యాప్‌టాప్, ప్రింటర్లను సోమవారం వితరణ చేశారు. పూర్వ విద్యార్థి జక్కేపల్లి రమేష్ వీటిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవిశంకర్‌కు అందజేశారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రమేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా దాతను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు నాగేశ్వరరావు, విద్యార్థి తల్లిదండ్రుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఊపందుకున్న వరి నాట్లు

మునేరు, బోర్లు, చెరువుల కింద అధికసాగు

పెనుగంచిప్రోలు: గ్రామాల్లో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో మునేరు, కాలువలకు నీరు చేరుతోంది. దీంతో మునేరు, బోర్ల కింద రైతులు ఖరీఫ్ వరి సాగు చేపట్టారు. అలాగే చెరువుల్లో నీరు వర్షపు నీరు చేరుతుండటంతో రైతులు సన్నాహాలు చేస్తున్నారు. అధిక దిగుబడులు సాధించాలన్న లక్ష్యంతో వ్యవసాయాధికారుల సూచనలు, సలహాల మేరకు ముందుకు సాగుతున్నారు. దీంతో పంట పొలాలు రైతులు, రైతుకూలీలతో కళకళలాడుతున్నాయి.

9వేల హెక్టార్లలో వరిసాగు..

జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఏటా ఖరీఫ్‌లో సుమారు 9వేల హెక్టార్లలో వరి పంట సాగవుతోంది. జగ్గయ్యపేట మండలంలో సుమారుగా 3,500 హెక్టార్లలో, పెనుగంచిప్రోలు 3వేలు, వత్సవాయి మండలంలో 2,600 హెక్టార్లలో రైతులు వరిసాగు చేస్తున్నారు. ప్రధానంగా రైతులు సాంబ మసూరి, బీపీటీ 5204రకాల విత్తనాలను ఎక్కువగా పండిస్తున్నారు.

ముమ్మరంగా నాట్లు..

పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు, గుమ్మడిదూర్రుతోపాటు వత్సవాయి మండలంలోని ఆళ్లూరుపాడు, రేగులగడ్డ పొలాల్లో నాట్లు వేస్తున్నారు. నియోజకవర్గంలోని చెరువులు కింద కూడా రైతులు పంటసాగుకు సిద్ధంగా ఉన్నారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా వ్యవసాయాధికారులు రైతులకు నాణ్యమైన విత్తనాలతోపాటు విలువైన సమాచారాన్ని అందిస్తుండటంతో ఆయా గ్రామాల్లో వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.



నాట్లు వేస్తున్న కూలీలు



వరినాట్ల కోసం పొలాన్ని దమ్ము చేస్తున్న రైతు

ఎరువులు, పురుగుమందులు జాగ్రత్తగా వాడాలి...

రైతులు మోతాదుకు మించి పురుగుమందులు వాడ కూడదని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. యూరియా కూడా తగిన పరిమాణంలో మాత్రమే వాడాలని అంటున్నారు. అధునాతన పద్ధతుల్లో సాగు చేస్తే ఎరువులు, పురుగు మందుల ఖర్చులు తగ్గే అవకాశం ఉంది. రేగడి భూముల్లో దమ్ము పూర్తి చేసిన రెండు రోజుల్లో నాట్లువేస్తే రైతులు ఆశించిన మేర ఫలితం ఉంటుంది. వరి నారు లేతాకు పచ్చరంగులో ఉండి, నాటు పైపైన నాటితే పిలకలు ఎక్కువగా తొడిగే అవకాశం ఉంటుందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

నాట్లు మొదలు పెట్టాం..



మునేరుకు నీళ్లు రావడంతో నాట్లు ప్రారంభించాం. ఆర్‌బీకేల ద్వారా రైతులకు విత్తనాలతోపాటు ఎరువులు కూడా అందిస్తే బాగుంటుంది. ఎక్కువగా సన్నాలు సాగు చేస్తున్నాం.

– గంగూరి ప్రసాద్, రైతు, అనిగండ్లపాడు

సూచనలు తప్పక పాటించాలి..



వ్యవసాయశాఖ ఇచ్చే సూచనలు, సలహాలను పాటించడం ద్వారా రైతులు పంటల సాగులో ఎరువులు, పురుగుమందుల వాడకం ఖర్చులను తగ్గించుకోవచ్చు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు విత్తనాలపాటు అన్ని రకాల సమాచారాన్ని అందిస్తున్నాం.

– రామసుబ్బారెడ్డి, వ్యవసాయాధికారి

ఘనంగా జగన్‌మోహనరావు జన్మదిన వేడుకలు



మాజీఎమ్మెల్యే జగన్‌మోహనరావు జన్మదిన కేక్‌ను కట్ చేస్తున్న నాయకులు



కంచికచర్లలో కేక్ కట్ చేస్తున్న వేమా తదితరులు

నందిగామ టౌన్: స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు జన్మదిన వేడుకలను ఆపార్టీ నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. కేక్‌ను కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. మాజీఎమ్మెల్యే జగన్‌మోహనరావుకు ఫోన్‌ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. తొలుత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు మాట్లాడుతూ మాజీఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ పార్టీ కార్యకర్తలకు అండగా నిలుస్తున్నారన్నారు. డాక్టర్ జగన్‌మోహనరావు ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, నాయకులు నెలకుదిటి శివనాగేశ్వరరావు, బొల్లినేని శ్రీనివాసరావు. చిలుకూరి బుచ్చిరెడ్డి, బుగ్గినేని సురేష్, సింగంశెట్టి మల్లికార్జునరావు, పాకాలపాటి కిరణ్, మువ్వల శ్రీను, కమతం నర్సిరెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంచికచర్లలో..

కంచికచర్ల: నందిగామ నియోజకవర్గ అభివృద్ధికి మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు విశేష కృషిచేశారని వైఎస్సార్‌కాంగ్రెస్‌పార్టీ పట్టణ కన్వీనర్ వేమా సురేష్‌బాబు, ఎంపీటీసీ సభ్యులు మాడుగుల మధుబాబు పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాజీఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహన్‌రావు పుట్టినరోజును సోమవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు కలిసి బర్త్‌డే కేక్ ను కట్‌చేశారు. డాక్టర్ జగన్‌మోహనరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ మాడుగుల శంకర్, బూత్ కన్వీనర్లు తంగిరాల సృజనీకుమార్, దాసరి రాంబాబు, ఎం.పాండు, నాయకులు దేవరకొండ గురవయ్య, నారిశెట్టి శ్రీనివాసరావు, వేమవరపు పురుషోత్తం, బత్రె శంకరరావు, గద్దల మహేష్, గుగులోతు శివ నాయక్, వేముల గోపి, పొన్నపల్లి శ్రీనివాసరావు, మాడుగుల ఆంజనేయులు, దేవిరెడ్డి చంటి, దేవిరెడ్డి శ్రీనివాసరావు, మండల శివ, నాగరాజు, దాదె బుచ్చిబాబు, వై.బాలయ్య, దూండీ, బూర్గుల చందు, యాదాల క్రీస్తురాజు పాల్గొన్నారు.

'కాసం'ఫ్యాషన్స్ షాపింగ్‌మాల్ ప్రారంభం

జగ్గయ్యపేట: వస్త్ర ప్రపంచంలో కాసం ఫ్యాషన్స్ నూతన ఒరవడి సృష్టిస్తోందని సినీనటి నభానటేష(ఇస్మార్ట్ శంకర్ సినిమా ఫేమ్) అన్నారు. పట్టణంలోని స్థానిక ఆర్టీసీ డిపో సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన కాసం ఫ్యాషన్స్ షాపింగ్‌మాల్‌ను మాజీ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభానుతో కలిసి సోమవారం ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా నభానటేష్ మాట్లాడుతూ 'కాసం' ఫ్యాషన్స్‌కు ఫ్యాషన్ రంగంలో దాదాపు 78ఏళ్ల చరిత్ర ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే 11షోరూమ్స్ ప్రారంభించారన్నారు. ఏపీలో మొట్టమొదటి షోరూంను జగ్గయ్యపేటలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. 'కాసం' ఫ్యాషన్స్‌లో చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు అవసరమైన దుస్తులు సరసమైన ధరలకే లభిస్తాయని వివరించారు. మాజీఎమ్మెల్యే సామినేని ఉదయభాను మాట్లాడుతూ కాసం గ్రూపు యాజమాన్యం ఈప్రాంతంలో షాపింగ్ మాల్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈమాల్ ప్రారంభంతో జగ్గయ్యపేటలో వస్త్ర రంగం కూడా అభివృద్ధి చెందడమే కాకుండా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. నభా నటేష్‌ను చూసేందుకు అభిమానులు షాపింగ్‌మాల్‌కు భారీగా తరలివచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్ మాజీ మున్సిపల్‌చైర్మన్ ఇంటూరి చిన్నా, టీడీపీ నాయకుడు శ్రీరాం చినబాబు, కౌన్సిలర్లు పందుల రోశయ్య, వట్టెం మనోహర్, కాసం గ్రూపు ప్రతినిధులు మల్లికార్జున్, నమశ్శివాయ, కేదారినాథ్, శివప్రసాద్, నవకళ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సినీనటి నభానటేష్ పక్కన మాజీ ప్రభుత్వవిప్ ఉదయభాను, రాఘవేంద్ర

ముగిసిన పవిత్రోత్సవాలు



స్వామివారి శాంతి కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



ఆలయంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న యోగానంద లక్ష్మీనరసింహస్వామి పవిత్రోత్సవాలు సోమవారం నిర్వహించిన స్వామివారి శాంతి కళ్యాణంతో ముగిశాయి. నాలుగురోజులపాటు స్వామి వారికి అర్చకులు శాస్త్రోత్తంగా పలు పూజలు నిర్వహించారు. చివరిరోజు ముందుగా స్వామి వారికి పూర్ణాహుతి, పవిత్రవిసర్జన కార్యక్రమాలు నిర్వహించి స్వామివారి ఉత్సవమూర్తులను ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కళ్యాణ మండపంపై ఉంచి వైభవంగా కళ్యాణం జరిపించారు. తిరుమల తిరుపతి వెంకటేశ్వర వేద పాఠశాల అర్చకులు, ఆలయ ప్రధానార్చకులు వేదాంతం యోగానందాచార్యులు, శ్రీధరాచార్యులు, గోపాలచార్యులు పర్యవేక్షణలో నిర్వహించారు. లోకకళ్యాణార్థం స్వామివారి కళ్యాణం, పవిత్రోత్సవాలు ఏటా నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఎస్.హేమలతాదేవి, కేసీపీ ప్రతినిధి రాంప్రసాద్, ఆలయ సిబ్బంది, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బోధనాభ్యాసన సామగ్రి పదర్శన

పెనుగంచిప్రోలు: పాఠశాల విద్యార్థుల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో డి.రవీంద్ర అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జరుగుతున్న విద్యా సప్తాహ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో బోధనాభ్యాసన సామగ్రిని ప్రదర్శించారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.జలజ, ఉపాధ్యాయులు ముక్కా సత్యనారాయణ, వేగినేటి వెంకటరమణ, రాము, మోహనరావు, ప్రసాద్, జొన్నలగడ్డ గోపాల్, శ్రీను పాల్గొన్నారు.

పత్తి పంటలో నీరు లేకుండా చూసుకోవాలి : ఏడీఏ

వత్సవాయి: ఇటీవల కురుస్తున్న వర్షాలకు పత్తి పంటలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని జగ్గయ్యపేట వ్యవసాయ సంచాలకులు పి.భవాని సూచించారు. మండలకేంద్రం వత్సవాయితోపాటు మక్కేపేటలోని పత్తి పొలాలను సోమవారం ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. పంటలో నిలిచిన నీటిని ముందుగా బయటకు వెళ్లేలా చూసుకోవాలన్నారు. అనంతరం ఎకరాకు 25కేజీల యూరియా, పొటాష్‌లను చల్లుకోవాలని తెలిపారు. ఎండుతెగులు ఉంటే లీటర్ నీటికి 3 గ్రాముల కాఫర్ ఆక్సీక్లోరైడ్‌ను కలుపుకుని మొదళ్ల వద్ద పోయాలన్నారు. రసం పీల్చే పురుగుకు ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా ఎసిటామిప్రిడ్, ఇమిడాక్లోప్రేడ్ కలుపుకుని పిచికారీ చేసుకుంటే ప్రయోజనం ఉంటుందని చెప్పారు. వరి నారుమడులలో కేజీ యూరియా కేజీ పొటాష్‌ను కలుపుకుని చల్లుకోవాలని సూచించారు. ఏడీఏ వెంట ఏవో వి.రవికుమార్, వీపీఏలు సీహెచ్ దివ్య, పి.పావని, ఎం.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



వత్సవాయిలో పత్తి పంటను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ భవాని

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు

కంచికచర్ల: కొద్దిరోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అందరూ అప్రమత్తంగా ఉండాలని ఈఓపీఆర్డీ బొజ్జగాని శ్రీనివాసరావు సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో సోమవారం స్పెషల్ శానిటేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ప్రాధాన్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో పంచాయతీ అధికారులు, ఆరోగ్య సిబ్బంది కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ మాట్లాడుతూ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా గ్రామాల్లో మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్యసిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. ఇళ్ల ముంగిట మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. గ్రామ వీధుల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని డంపింగ్ యార్డుకు తరలించాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు బుడ్డి విజయలక్ష్మి, బొక్కా రవికుమార్, పేరం నర్సమ్మ, ఉయ్యూరు అనుమాయమ్మ, వేల్పుల సునీత, తుల్లిమిల్లి రాజకుమార్, కోదాటి సీతారాం తదితరలు పాల్గొన్నారు.



చెవిటికల్లులో ర్యాలీ చేస్తున్న సర్పంచి విజయలక్ష్మి, కార్యదర్శి రవికుమార్, ఆరోగ్య సిబ్బంది



గండేపల్లిలో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు



వేములపల్లిలో ర్యాలీలో పాల్గొన్న నాయకులు, ఆరోగ్యసిబ్బంది



గండేపల్లిలో విద్యార్థులకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది, టీచర్లు

శ్రీనారసింహ కథాశతకం పుస్తకావిష్కరణ

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని చేగు విద్యాలయంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త తట్టా లక్ష్మీ నరసింహాచార్యులు రచించిన శ్రీనారసింహ కథాశతకం గ్రంథాన్ని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ జగ్గయ్యపేట పట్టణాన్ని ఆధ్యాత్మికంగా ముందుకు తీసుకువెళ్లిన టీఎల్ఎన్ ఆచార్యులు రచించిన శ్రీనారసింహ కథాశతకం గ్రంథాన్ని తాను ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, తట్టా వేణుగోపాలచార్యులు, డాక్టర్ తట్టా లక్ష్మీ నరసింహాచార్యులు సతీమణి వెంకటరాఘవమ్మ, వెంకట శేషరంగ రామానుజం, కీర్తి, వసంతలక్ష్మి, మాధవిలత, తట్టా శ్రీరామ నరసింహాచార్యులు, స్థానిక న్యాయవాది ఆకుల స్వాతికుమార్, లిటిల్ ఏంజిల్స్ హైస్కూల్ వైస్ ప్రిన్సిపాల్ తిరువెంగళాచార్యులు, చేగు విద్యాలయం హెచ్ఎం కె.రామానుజాచార్యులు, గ్రంథకర్తలు గుదిమెళ్ల వేదాద్రి లక్ష్మీ నరసింహాచార్యులు, వాణి పాల్గొన్నారు.



శ్రీనారసింహ కథాశతకం గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర తదితరులు

ఎస్‌జీఎస్‌లో నూతన డిగ్రీ కోర్సులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని గెంటేల శకుంతలమ్మ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యాశాఖ, కృష్ణా విశ్వవిద్యాలయం వారు పలు నూతన డిగ్రీ కోర్సులకు అనుమతి ఇచ్చినట్లు కళాశాల యాజమాన్య కమిటీ ప్రెసిడెంట్ అండ్ కరస్పాండెంట్, మాజీ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరానికి గాను బీఎస్సీ ఆనర్స్(ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ), బీఎస్సీ ఆనర్స్(డేటా ఎనాలిటిక్స్), బీకామ్ ఆనర్స్(ఫైనాన్స్), బీఎస్సీ ఆనర్స్(ఆర్టిఫిసియల్ ఇంటిలిజెన్స్), బీఎస్సీ ఆనర్స్(ఎలక్ట్రానిక్స్)కోర్సుల నిర్వహణకు అనుమతి లభించినట్లు తెలిపారు. ఆయా కోర్సుల్లో చేరగోరు విద్యార్థులు కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

ఇసుక లారీల అడ్డగింత



రైతుకూలీ సంఘనేతలు నిలిపివేసిన అధికలోడుతో వెళ్తున్న లారీలు

కంచికచర్ల: ఇసుక నిల్వ యార్డుల నుంచి అధికలోడుతో వెళ్తున్న లారీల కారణంగా రోడ్డుపై ద్విచక్రవాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రైతుకూలీ జిల్లా సంఘ అధ్యక్షుడు ముప్పాళ్ల రాంబాబు ఆవేదన వ్యక్తంచేశారు. చందర్లపాడు మండలం కొడవటికల్లు సమీపంలోని ఇసుక స్టాక్ పాయింట్ నుంచి ఇసుకను తరలిస్తున్న వాహనాలను రైతుకూలీసంఘం నాయకులు అడ్డుకున్నారు. ఈసందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ఒక్కో వాహనంలో 20 టన్నుల ఇసుక మాత్రమే వాహనాలకు ఇసుక తరలించేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వగా, కొంతమంది అధికలోడుతో ఇసుకను తరలిస్తున్నారన్నారు. దీంతో రోడ్లు ధ్వంసమవుతూ ద్విచక్ర వాహనదారులు, ఆటోవాలాలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇసుక లారీల ట్రాఫిక్ కారణంగా పంటపొలాలకు వెళ్లేందుకు రైతులు, రైతు కూలీలు అనేక అవస్థలు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధిక లోడుతో వెళ్తున్న ఇసుక లారీలను నియంత్రించడంతోపాటు రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు యాదాల నాగేశ్వరరావు, ఎ.నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అదుపులో డయేరియా

గుమ్మడిదుర్రు(పెనుగంచిప్రోలు): మండలంలోని గుమ్మడిదుర్రు గ్రామంలో డయేరియా పరిస్థితి నిలకడగా ఉంది. గ్రామంలో సోమవారం కొత్తగా డయేరియా కేసులు నమోదు కాలేదు. మంగళగిరి ఎయిమ్స్‌లో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మాత్రమే చికిత్స పొందుతున్నారు. వైద్య సిబ్బంది గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. జొన్నలగడ్డ సమీపంలోని బోరు వద్ద నుంచి ట్యాంకర్ల ద్వారా గ్రామస్తులకు తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు సర్పంచ్ నక్కా కమల తెలిపారు.

వైద్యశిబిరం సందర్శన..

గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి అమృత సందర్శించారు. గ్రామంలో డయేరియా బారినపడినవారి వివరాలను తెలుసుకోవడంతోపాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్య సిబ్బందికి సూచించారు. విజయవాడ ఆసుపత్రిలో శనివారం మృతి చెందిన నక్కా కుమారి కుటుంబసభ్యులతో మాట్లాడారు. కుమారి గుండె సంబంధిత సమస్యతో మృతి చెందిందని, డయేరియా సమస్య కాదని కుటుంబసభ్యులు రాతపూర్వకంగా తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి పి.ఇందిర, గ్రామనాయకులు నక్కా సుధాకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్న పంచాయతీ సిబ్బంది

వెబ్ డెవలప్‌మెంట్‌కు అత్యంత ప్రాధాన్యం



మాట్లాడుతున్న సాయి శశాంక్

మైలవరం: ఆధునిక డిజిటల్ యుగంలో వెబ్ డెవలప్‌మెంట్ అనేది అత్యంత ప్రాధాన్యం గల నైపుణ్యాల్లో ఒకటని ఇన్ఫోస్పైస్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ భావరాజు సాయి శశాంక్ తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం, సీఎస్ఐ ఎల్‌బీఆర్‌సీఈ స్టూడెంట్ బ్రాంచ్ ఆధ్వర్యంలో వెబ్ డెవలప్‌మెంట్ బేసిస్ బూట్ క్యాంపు అనే అంశంపై ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు వారం రోజుల పాటు జరిగే శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న శశాంక్ మాట్లాడుతూ.. అభ్యాసకులను ప్రొఫెషనల్ స్థాయికి తీసుకువెళ్లే క్రమంలో వేగంగా, సమర్థవంతంగా నేర్పించడంలో బూట్ క్యాంప్‌లు బాగా ప్రాచుర్యం పొందాయన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రమేష్‌రెడ్డి మాట్లాడుతూ.. యూజర్ ఇంటర్‌ఫేస్, యూజర్ అనుభవం, అభివృద్ధి అప్లికేషన్స్ ఫ్రేమ్‌వర్క్, వారికి ఉద్యోగ అవకాశాలు, ప్రొఫెషనల్ ఎదుగుదల కోసం ఒక బలమైన పునాది ఇస్తోందన్నారు. ఐటీ విభాగాధిపతి డాక్టర్ బి.శ్రీనివాసరావు ప్రసంగించారు. హేమలత, సాంబశివరావు కోఆర్డినేటర్లుగా వ్యవహరించారు.